www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 2 జనవరి 2024
5
కాకినాడ



సిఎం పర్యటనను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఈ నెల 3న కాకినాడకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పెద్దాపురం డివిజన్ అభివృద్ధి అధికారి కెవిఎస్.ప్రసాదరావు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిఎం పర్యటన ఏర్పాట్లపై డిఎల్‌డిఒ మండల స్థాయి అధికారులతో సమావేశం జరిగింది. ఎంపిడిఒ బి.శ్రీలత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఎం పర్యటనకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణ, సత్యారెడ్డి, గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

కుటుంబ పోషణ ఎలా..?

- క్షేత్రస్థాయిలో ఆశాల విస్తృత సేవలు
- అయినా అరకొర వేతనాలే..
- సంక్షేమ పథకాలకు దూరం
- రోజురోజుకు పెరుగుతున్న పనిభారం



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు అందేలా రోజంతా తీరుబడిలేకుండా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు కరవయ్యాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆదాయం లేక కుటుంబ పోషణ భారంగా మారింది. చేస్తున్న పనికి వస్తున్న జీతం సరిపోక అప్పులు చేసి బతుకు ఈడుస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 3,200 మంది ఆశా కార్యకర్తలు పనిచేస్తున్నారు. మాతా శిశు మరణాలను తగ్గించేందుకు అందిస్తున్న సేవల్లో ఆశాలు కీలకం. ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సాహించడం, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వంటి పనులతో పాటూ, పుట్టిన చిన్న పిల్లలకు ఇమ్యునైజేషన్ వ్యాక్సిన్లు వేయించడం, 12 వారాల్లోపు ఉన్న గర్భిణులను గుర్తించి వారిని నమోదు చేయడం వంటి విధులూ వీరే నిర్వహిస్తున్నారు. వీటితో పాటూ డెంగీ, టిబి, లెప్రసి, సర్వేలు కూడా చేస్తున్నారు. ఇటీవల ఆరోగ సర్వేలో సైతం వీరి పాత్ర ఉంది.

వైద్య, ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న ఆశా వర్కర్లు ఓ పక్క కనీస వేతనాలు లేక అల్లాడుతుంటే, మరోవైపు ప్రభుత్వ పథకాలు దూరమై పని ఒత్తిడి పెరిగి తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి వారికి బిడ్డ పుట్టి, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిగే వరకూ వైద్యం సాయం అందించాల్సిన పని ఆశాలపైనే ఉంది. అంతేకాకుండా వైద్య,ఆరోగ్య శాఖ ద్వారా అమలవుతున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఇంత చేస్తున్నా శ్రమకు తగ్గ ఫలితం లేకుండా పోతుందని ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు కనీస వేతనాలు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఏనాడూ సర్కారు పట్టించుకోలేదని వర్కర్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇస్తున్న వేతనం దినసరి కూలి కంటే తక్కువ అని చెబుతున్నారు. ఇచ్చే అరకొర వేతనం కూడా నెలలు తరబడి పెండింగ్ లోనే ఉంచుతున్నారని తెలిపారు. అనేకమంది ఆశలను కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరుతున్నారు. జీవిత బీమా సౌకర్యం లేక సతమతమవుతున్నారు. మరణించిన ఆశాల కుటుంబంలో అర్హులను గుర్తించి వారికే ఆశలుగా అవకాశం కల్పించాలని అడుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు



వైద్య, ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో విశేష సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలు తీవ్ర పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. వేళాపాళా లేకుండా ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయిస్తున్నారు. కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదు. అరకొర జీతాలతో కుటుంబాలను ఎలా పోషించుకుంటారు. ప్రభుత్వం ఎప్పటికైనా స్పందించి కనీస వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

- చంద్రమళ్ల పద్మ, ప్రధాన కార్యదర్శి, ఆశా వర్కర్స్ యూనియన్, కాకినాడ

ప్రభుత్వ పథకాలకు దూరం



ఇచ్చేది అతి తక్కువ వేతనం, కాని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ పథకాలను అమలు చేయడం లేదు. ఈ సమస్యపై అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇటు వేతనాలు సరిపోక అటు ప్రభుత్వ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం.

- రాయుడు నాగలక్ష్మి, ఆశా కార్యకర్త, తాళ్లరేవు


అంబేద్కర్ విగ్రహం వద్ద నినదిస్తున్న దళిత, ప్రజా సంఘా నాయకులు

భీమా కోరేగావ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

ప్రజాశక్తి - కాకినాడ

భీమా కోరేగావ్ స్ఫూర్తితో తమ హక్కుల కోసం దళితులందరూ ఐక్యంగా పోరాడాలని దళిత ఉద్యమ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, వి.కృష్ణమూర్తి, బుద్ధ విహార్ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ జి.భానుమతి, కెవిపిఎస్ సీనియర్ నాయకులు ఎం.రాజశేఖర్, జనచైతన్య నాయకులు పవన్ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద భీమ కోరేగావ్ స్మారక స్థూపం వద్ద మృతవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీష్వా బ్రాహ్మణులపై మహార్ పోరాట యోధుల యుద్ధ విజయానికి చిహ్నమే భీమా కోరేగావ్ అని అన్నారు. 500 మంది మహార్ వీరులు 28 వేల మంది పీష్వా బ్రాహ్మణ సైన్యంతో మహారాష్ట్ర కోరే గావ్‌లోని భీమా నది వద్ద భీకర యుద్ధం చేసి 1818 జనవరి 1న విజయం సాధించారన్నారు. అప్పటి మహార్ నాయకుడు సిద్‌నాక్ పీష్వా సైన్యాధికారి బాపు గోఖలే వద్దకు వెళ్లి పశువులకన్నా హీనంగా చూడబడుతున్న తమకు గౌరవంగా బతికే అవకాశం కల్పించాలని కోరారు. వేల సంవత్సరాల బానిస సంకెళ్లు తెంచుకోవాలని ప్రతినభూనిన ఐదు వందల మంది మహార్ సైన్యం, రెండు వందల మంది బ్రిటిష్ సైన్యంతో కలిసి 200 కిలోమీటర్లు నడిచి భీమా నది ఒడ్డుకు చేరుకున్నారన్నారు. 20 వేల మంది పదాతిదళం, 8 వేల మంది అశ్విక దళంతో కనుచూపు మేరలో కనిపిస్తున్న పీష్వా సైన్యాన్ని చూస్తే ఎవరికైనా వణుకు పుడుతుం దన్నారు. కానీ బతికితే పోరాట వీరులుగా బతకాలనీ, లేదంటే హీనమైన బతుకులతో చావాలనీ నిర్ణయిం చుకున్న మహార్ సైన్యం పీష్వా సైన్యంతో యుద్ధానికి తలపడిందన్నారు. తిండి లేకుం డా కాలినడకన వచ్చి కూడా మహార్ సైన్యం సింహా ల్లాగా పీష్వా సైన్యాన్ని ఎదుర్కోవడాన్ని చూసిన బ్రిటి ష్ లెఫ్టినెంట్ కల్నల్ ఆశ్చర్యపోయారన్నారు. భీకర పోరాటంలో భీమా నది ఎర్రబడిందన్నారు. అమరు లైన 12 మంది మహార్ సైనికులకు బ్రిటిష్ వారు స్మారక స్థూపం కట్టించడమే కాకుండా మహార్ సైనికు లతో మహార్ రెజిమెంట్ ఏర్పాటు చేశారని, ఆ స్ఫూ ర్తితో ప్రతి ఒక్కరు తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం, దళిత సంఘాల నాయకులు భయ్యా రాజేంద్రప్రసాద్, వివి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సామాన్య ప్రజలు, న్యాయవాదులకు ఇబ్బందికరంగా ఉన్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2023ను తక్షణమే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడులో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ జస్టిస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు బుగత శివ మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం వల్ల సామాన్య ప్రజలకు న్యాయం దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ చట్టం వల్ల న్యాయవాదులకు వృత్తిపరమైన ఇబ్బందులు తలెత్తనుందని తెలిపారు.



అంబేద్కర్ సెంటర్లో ధర్నా చేస్తున్న న్యాయవాదులు, ప్రజలు

కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో న్యాయవాది అవసరాల దేవి, ప్రజా సంఘాల నాయకులు రేచుకట్ల సింహాచలం, మానుకొండ లచ్చుబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

- శిబిరాల్లోనే నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 21వ రోజుకు చేరింది. జిల్లాలోని పలు మండలాల్లో నిర్వహిస్తున్న నిరసన శిబిరాల్లోనూ వారు నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. **కాకినాడ** అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె నూతన సంవత్సరం ప్రారంభం రోజునే అదే పోరాట స్ఫూర్తితో కొనసాగింది. సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ ప్రారంభించారు. వారికి మద్దతుగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు అన్నారాం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, రవి చక్రవర్తి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండగల వేళ అంగన్‌వాడీలను రాష్ట్ర ప్రభుత్వం రోడ్డున పడేసిందని, వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. వీరు చేస్తున్న పోరాటానికి యుటిఎఫ్ సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందన్నారు. అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి లక్షలమంది కార్మికులు, ఉద్యోగులు మద్దతుగా నిలిచారన్నారు. సమస్యలు పరిష్కారం చేయడంలో ఆలస్యం చేస్తే రాష్ట్ర ప్రభుత్వానికే నష్టమన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి జి.రమణమ్మ, నాయకులు జ్యోతి, విజయ, మున్ని, రమ, సరోజ, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు. **పెదపూడి** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరం వద్ద నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని అంగన్‌వాడీలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ తీరును ఎండగట్టారు. యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల ఉద్యమాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో సమీకరించిన నిధులను యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సమ్మంగి శ్రీరాములు చేతుల మీదుగా అంగన్‌వాడీ నాయకత్వానికి రూ.7200లను అందించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ 21 రోజులుగా అంగన్‌వాడీలు తమ కుటుంబాలను విడిచి రోడ్లమీద ఉద్యమిస్తుంటే ప్రభుత్వం వారిని రెచ్చగొట్టేలా ప్రకటనలు చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తే సమ్మెను మరింత ఉధృతం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని యూనియన్ జిల్లా నాయకురాలు ఎం.రాజేశ్వరి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు పెద్దిరాజు, కెవిబి.కృష్ణవేణి, ఎన్.మాణిక్యం, శ్యామల, సరోజిని పాల్గొన్నారు. **ఏలేశ్వరం** తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నూతన సంవత్సర వేడుకలను బహిష్కరించి అంగన్‌వాడీలు తమ నిరసనలో భాగంగా రిలే నిరహారదీక్షలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సెక్టార్ అధ్యక్షురాలు కాకరపల్లి సునీత, ఎన్.అమలావతి, సిహెచ్.వెంకటలక్ష్మి, జె.రాణి, పి.నూకరత్నం, ఆర్.రత్నకుమారి, పి.దుర్గా సూర్య కుమారి, కె.రమ్య, పి.గంగా భవాని, కె.బంగారుపాప, బి.కృపావతి పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జగ్గంపేటలో నిర్వహిస్తున్న నిరసన శిబిరం వద్ద అంగన్‌వాడీలు కేక్‌ను కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోశాధికారి రాజేశ్వరి మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లలో గ్రాడ్యుటీని అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు పెంచాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అవాస్తవాలను పక్కన పెట్టి, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి, కిర్లంపూడి, జగ్గంపేట మండలాలకు చెందిన అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీ శిబిరాన్ని ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి డి తులసీదేవి మాట్లా డారు. గత 21 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణ మన్నారు. సిఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేసేంత వరకూ తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామలక్ష్మి, సత్యవతి, భవాని, వెంకట లక్ష్మి, విజయశాంత, ప్రజావాణి, నందిని తదితరులు పాల్గొన్నారు. **కిర్లంపూడి** స్థానికంగా అంగన్‌వాడీలు చేస్తున్న నిరసన శిబిరంలో రిలే నిరహారదీక్షలను కొనసాగించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎంతటి ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు రత్నం, నాయకులు పి. సావిత్రి, షేక్ పరివిన్, జి.రత్నం, పి.మంగాయమ్మ, పి.ప్రభావతి, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీలు తమ నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు దాడి బేబీ అమల మాట్లాడుతూ 21 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. కాకినాడలో జనవరి 3న జరిగే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో కార్యకర్తలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎల్ పద్మావతి, అమల, సావిత్రి, స్నేహ, కాలే దేవి, నెహ్రూ కుమారి, చంటమ్మ, నాగమణి, లోవ తల్లి, వసంత, తులసి, లక్ష్మి, వరలక్ష్మి, భవాని, వనకుమారి, కృష్ణవేణి, రాణి, ఇందిర, మంగ తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** ప్రత్తిపాడు కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన వద్దకు యుటిఎఫ్ నాయకులు టి.శ్రీనివాసరావు, డి.రాజబాబు, రామలింగేశ్వర రావు, ఆల్ ఇండియా లాయర్ లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర నాయకుడు బుగత శివ, న్యాయవాది అవసరాల దేవి, సిఐటియు నాయకుడు రొంగల ఈశ్వరరావు తమ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకులు అల్లాడి లక్ష్మి, కె.హేమలత, సిహెచ్.నాగ సత్యవతి నాయకత్వం వహించారు. **కరప** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన అంగన్‌వాడీల నిరసన శిబిరాన్ని మండల యుటిఎఫ్ అధ్యక్షులు వై.శ్రీనివాసరావు, పేపకాయల రాజుబాబు, సోమేశ్వరరావు, అర్జున్, కె.వి.రమణ, పివి రమణ, నూకరాజు సందర్శించారు. వారి ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఉద్యమ అవసరాలకు వినియోగించేందుకు రూ.2,500 నగదును యూనియన్ నాయకులకు అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.వీరవేణి, ఎస్.వరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, దైవకుమారి, అచ్చారత్నం, కల్పలత, హెల్పర్ సత్యా మాధవి, పాల్గొన్నారు. **తాళ్లరేవు** సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు అంగన్‌వాడీలకు ప్రజా సంఘాలు మద్దతుగా ఉంటాయని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. తాళ్ల రేవు మండల యుటిఎఫ్ నాయకులు తాతారావు, త్రిమూర్తులు, ఎస్.వి.రమణ మద్దతుగా ప్రకటించారు. ఈ సందర్భంగా టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇకనైనా దిగివచ్చి అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దుప్పి అదృష్టదీపుడు, ఎం.తణుకు రాజు, పులుపకూర కృష్ణ, యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



నిరసన శిబిరం వద్ద మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు అన్నారాం



పెదపూడిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు


అంగన్‌వాడీల ఉద్యమానికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కార్టూ'నిజం'



ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

నూతన సంవత్సర వేడుకలు జిల్లావ్యాప్తంగా ఉత్సాహ పూరిత వాతావరణంలో సోమవారం జరిగాయి. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ఇళ్లకు పెద్దఎత్తున ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున చేరుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పూల బుకేలు, పండ్లు, శాలువాలు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. **కాకినాడ** నూతన సంవత్సరంలో కాకినాడ జిల్లా అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆకాంక్షించారు. నూతన సంవత్సరం 2024 సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సాహాలతో పరస్పర శుభాకాంక్షలతో జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద నిలయం వసతి గృహం విద్యార్థులు, ఉమా మనోవికాస కేంద్రం దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి మెమెంటో, పుష్పగుచ్ఛాలను అందజేశారు. జిల్లా కలెక్టర్‌కు ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. **గండేపల్లి** మండలంలోని వివిధ గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మురారి గ్రామ వైసిపి యువ నాయకులు, ఉపసర్పంచ్ జాస్తి వసంత ఇంటికి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్‌ను కట్ చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిపి చల్లగళ్ల దొరబాబు ఇంటివద్ద, ఎన్‌టి.రాజపురం గ్రామంలోని జడ్‌పిటిసి పరిమి బాబు ఇంటి వద్ద, జెడ్ రాగంపేట గ్రమాంలో గ్రామ సర్పంచ్ కందుల చిట్టిబాబు ఇంటి వద్ద సింగం పాలెం గ్రామంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావు ఇంటి వద్ద ఆయా పార్టీల అభిమానులు పాల్గొని నాయకులకు శుభాకంక్షలు తెలిపారు. **సామర్లకోట రూరల్** పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ప్రజాప్రతినిధుల గృహాలు నూతన సంవత్సర వేడుకలతో సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని అచ్చంపేట గ్రామంలోని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప గృహం వద్ద, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు గృహం, జనసేన పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మల రామస్వామి కార్యాలయాల వద్ద ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున చేరుకున్నారు. సామర్లకోట మున్సిపల్ ఛైర్మన్ గంగిరెడ్డి అరుణ, వైస్ ఛైర్మన్ ఊబా జాన్ మోసెస్‌లను పలువురు అధికారులు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కలిసి ఘనంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. **కిర్లంపూడి** మండలంలోని ప్రజా ప్రతినిధుల గృహాలు సందడిగా మారాయి. కాపు ఉద్యమ నేత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభనికి శుభాకాంక్షలు తెలిపేందుకు తన అనుచరులు భారీ స్థాయిలో ఆయన నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. **తాళ్లరేవు** మండలంలోని ప్రజాప్రతినిధులకు, పలు ప్రజా సంఘాల నాయకులు, అధికారులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్‌లో ఎంపిపి రాయుడు సునీతకు యుటిఎఫ్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నూతన క్యాలెండర్‌ను ఎంపిపి ఆవిష్కరించారు. ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జడ్‌పిటిసి దొమ్మేటి సాగర్‌కు పలువురు అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. **జగ్గంపేట రూరల్** నియోజకవర్గంలోని నేతల ఇంట నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ మంత్రి తోట నరసింహంను కిర్లంపూడి మండలం వీరవరంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు చెప్పారు. టిడిపి నేత జ్యోతుల నెహ్రుకు జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయ, విష్ణాలయ ప్రాంగణంలోని మట్టి శివలింగాలు తయారీ కార్యక్రమం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. **కాకినాడ రూరల్** మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జనసేన పార్టీ నాయకుడు పంతం నానాజీ స్వగహం వద్ద నూతన సంవత్సరం వేడుకలు పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో జనసైనికులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక శుభం కాపు కళ్యాణ మండపంలో వంగా గీత ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు ఇంటి వద్ద న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును తిమ్మాపురం యనమల క్యాంపు కార్యాలయంలో సీనియర్ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.


చిన్నారులతో నూతన సంవత్సర వేడుకల్లో కేక్‌ను కట్ చేస్తున్న కలెక్టర్

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రామవరంలో జరిగిన రోడ్ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఎస్ఐ నాగార్జున రాజు తెలిపిన ప్రకారం.. ఆదివారం రాత్రి 16 వ నెంబర్ జాతీయ రహదారిపై రామవరం జంక్షన్ నుంచి ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వెళుతుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి అన్నవరం వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న కొండేపూడి నవీన్ (18) అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న సింగర్ల మహేష్ బాబు, కళ్యాణం చిన్న మరిడయ్యకు గాయాలు కావడంతో వారిని హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎంఎల్ఎ గొల్లపల్లి ఇంట సందడి

ప్రజాశక్తి - యానాం

నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఇంట సందడి నెలకుంది. అధికారులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు ఆయనను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎను శాలువాలతో ఘనంగా సత్కరించారు. యానాం పరిపాలనాధికారి ఆర్.మునుస్వామి, ఎస్‌పి.రఘునాయగం, తదితర పోలీసు సిబ్బంది అలాగే యానాంలోని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది గొల్లపల్లిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యానాం బిజెపి అధ్యక్షుడు కనకాల రాజు ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఎల్ఎ అశోక్ ఆవిష్కరించారు.

బిపిఎల్ కార్డుదారులకు సంక్రాంతి కానుక

ప్రజాశక్తి - యానాం

ఎరుపు రంగు రేషన్ (బిపిఎల్) కార్డు లబ్దిదారులకు సంక్రాంతి కానుకగా రూ.1000 అందించాలని సిఎం రంగసామి ఆదేశాలు జారీ చేసినట్లు స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి జయకుమార్ ప్రకటనలో తెలిపారు. ఒక రేషన్ కార్డుకు గరిష్టంగా రూ.1000, ఒక్కరే ఉన్నట్లయితే రూ.500 నగదు జనవరి 4న బ్యాంకు ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు. యానాంలో 11 వేల మంది అర్హులున్నారు

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఐ.పోలవరం

యుటిఎఫ్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంఇఒలు ఎన్.కొండా రెడ్డి, కె.తిరుమలరావు ఆవిష్కరించారు. అనంతరం ఎంపిపి మోర్త రాణి, మిరియం జ్యోతి, ఎంపిడిఒ టి.చైతన్యరాజ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. క్యాలెండర్, డైరీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు మట్టపర్తి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పడమటి ఏడుకొండలు, అప్పాడి వెంకటేశ్వరరావు, వివికెవి.శాస్త్రి, వైవి.రామకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, ఆర్.అప్పలస్వామి, ఎంఎస్ఆర్.గణేశ్వరరావు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



వికలాంగునికి వాహనం అందిస్తున్న రమణారావు

కుంచే రమణారావుకు పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అమలాపురం

నూతన సంవత్సరం సందర్భంగా గుడ్‌సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, వైసిపి సీనియార్ నాయకులు కుంచే రమణారావుకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అమలాపురంలోని దుడ్డువారి అగ్రహారంలోని ఆయన నివాసానికి జిల్లా నలుమూలల నుంచి రాజకీయ నాయకులు, పాస్టర్లు, అభిమానులు తరలి వచ్చి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తనకు శుభాకాంక్షలకు పుష్పగుచ్ఛాల బదులు పేద పిల్లలకు ఉపయోగపడేలా నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రి తేవాలన ఆయన సూచించారు. దీంతో చాలామంది అభిమానులు నూతన విద్యాసామగ్రిని అందజేశారు. వారిని రమణారావు అభినందించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. సిఎం వైఎస్.జగన్ వైఎస్సార్ పింఛను కానుకను రూ.3,000కు పెంచి ప్రతి ఇంటా పెద్దకొడుకు అయ్యారన్నారు. సూర్యోదయం కంటే ముందే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వాలంటీర్ల ద్వారా పింఛను కానుక పంపించి రాష్ట్రంలో 66 లక్షల మందికి ప్రయోజనం చేకూర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు.

పారిశుధ్య కార్మికులకు నివాస గృహాలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులకు నాలుగు పోర్షన్లతో కూడిన నివాస గృహాన్ని స్థానిక వాటర్ ట్యాంక్ ప్రక్కన అన్ని వసతులతో నూతనంగా నిర్మించారు. దాతలు సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి, వైసిపి నేతలు మేడపాటి అప్పారెడ్డి, గొలుగూరి సత్తిరెడ్డి, తాడి శ్యామ్ సుందర్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ నివాస గృహాలను మాజీ గ్రామ సర్పంచ్ ద్వారంపూడి అప్పారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు గ్రామంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే విధంగా మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు ఈ గృహాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తాడి మెహర్ ఆదిత్య రెడ్డి, తాడి నాగమోహన్ రెడ్డి, తాడి రామచంద్రారెడ్డి, తాడి సుబ్బారెడ్డి, కట్టా ప్రసాద్, కట్టా రామకృష్ణ, అవిడి శ్రీను పాల్గొన్నారు.

నిరంతర ప్రజా సేవకుడు కుడుపూడి

ప్రజాశక్తి - కాకినాడ

సిపిఎం నాయకుడిగా నిరంతరం ప్రజలకు సేవలందించిన అమరజీవి కుడుపూడి సూర్యనారాయణ అని పలువురు కొనియాడారు. కుడుపూడి సూర్యనారాయణ 21వ వర్ధంతి సందర్భంగా సోమవారం సుందరయ్య భవన్‌లో ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా సీనియర్ నేత దువ్వా శేషబాబ్జీలతోపాటు కె.సత్తిరాజు, జి.ప్రభాకర వర్మ అమరజీవి కుడుపూడి సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్, శేషబాబ్జీ మాట్లాడుతూ సూర్యనారాయణ కమ్యూనిస్టు ఉద్యమం పట్ల విద్యార్థి దశలోనే ఆకర్షితులై కడవరకూ కష్టజీవుల ఉద్యమంలో మమేకం అయ్యారని తెలిపారు. మానవతకు చిరునామాగా నిలిచిన నిరంతర ప్రజా సేవకుడు కుడుపూడి అని కొనియాడారు. ఇంద్రపాలెం గ్రామ పెద్దల బందంలో సభ్యుడుగా తనదైన శైలిలో గ్రామ అభివృద్ధి కోసం కృషి చేసారని గుర్తు చేశారు. ప్రజా సంఘాల కార్యక్రమాలన్నింటిలో ఆయన ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. విద్యార్థి, యువకులను చదువుల్లో, క్రీడల్లో ప్రోత్సహిస్తూ, అభ్యుదయ మార్గంలో నడిపించారని కొనియాడారు. సుందరయ్య వారసత్వాన్ని అందించిన కుడుపూడి చిరస్మరణీయుడని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకుడు కె.సత్తిరాజు మాట్లాడుతూ కుడుపూడి వంటి ఆదర్శమూర్తుల స్ఫూర్తితో నేటితరం ప్రజా సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, కె.నాగజ్యోతి, సిహెచ్.రాజ్ కుమార్, అంకం సుబ్రహ్మణ్యం, ఎం.రవి, విజయ, సూర్యకుమారి, శ్రీదేవి, వేణు, వసంత, అప్పలకొండ, ఎన్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కుడుపూడి సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మలుపులో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్



ప్రమాదకరంగా ఉన్న రహదారి

సుమారు 60 ఏళ్ల పైబడి చరిత్ర ఉన్న సామర్లకోట రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్వహణను ఆర్ అండ్ బి అధికారులు గాలికి వదిలేశారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి తరచూ గోతులు ఏర్పడి మరమ్మతులకు గురవడం ఒక ఎత్తు అయితే మరోవైపు రిటైనింగ్ వాల్ పలుచోట్ల శిథిలమై పడిపోయిన నెలలు తరబడి పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. సామర్లకోట నుంచి కాకినాడ వైపు తిరిగే ప్రధాన మలుపులో బ్రిడ్జి రైలింగ్ సుమారు 10 మీటర్లు విరిగిపడి నెలలు గడుస్తున్న అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. భారీ వాహనాలు, ద్విచక్ర వాహనదారులు మలుపులు ఆదమరిస్తే బ్రిడ్జిలు వద్ద ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అలాగే బ్రిడ్జి ఎడం వైపున పలుచోట్ల రక్షణ గోడ శిథిలమై ఉంది. మలుపులో మంచి ఉన్న ప్రమాదం పట్ల వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు స్పందించి సత్వరమే శిథిలమైన రైల్వే ఓవర్ బ్రిడ్జి రైలింగ్‌ను పునరుద్ధరించాలని, ఏర్పడుతున్న గోతులను పూడ్చి పూర్తిస్థాయిలో విద్యుత్ లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు స్థానికులు కోరుతున్నారు.

తుని టిడిపిలో భగ్గుమన్న విభేదాలు

ప్రజాశక్తి - కోటనందూరు

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తుని నియోజకవర్గ టిడిపిలో వర్గవిభేదాలు భగ్గుమన్నాయి. తుని సాయి వేదికలో నూతన సంవత్సర శుభాకాంక్షలు సంబరాల నిర్వహించడానికి ఏర్పాటుచేసిన వేదికపై టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, తుని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ యనమల దివ్య, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల కృష్ణుడు ఒకే వేదికపై ఉన్నారు. శుభాకాంక్షలు తెలపటానికి, తొండంగి, కోటనందూరు, తుని, తుని రూరల్ ప్రాంతాలకు చెందిన టిడివి కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భ యనమల రామకృష్ణుడు, యనమల దివ్యకు అభినందనలు తెలిపేందుకు యనమల రాజేష్‌కు చెందిన వర్గీయులు ప్రయత్నించారు. దీంతో యనమల కృష్ణుడు వర్గీయులు వారిని అడ్డుకోవడంతో మాటల యుద్ధం ప్రారంభం అయ్యింది. మాటా మాటా పెరిగి రెండు వర్గాలు బాహాబాహీకి దిగారు. యనమల రామకృష్ణుడు సమక్షంలోనే ఈ రెండు వర్గాలు ఘర్షణకు దిగడంతో ఆయన ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తునిలో నెలకున్న వర్గాల పోరుతో ఇప్పటికే మూడు దఫాలు ఓటమిని చవి చూశారు. త్వరలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో రామకృష్ణుడు కుమార్తె యనమల దివ్య పోటీ చేయనున్న తరుణంలో పార్టీ శ్రేణులను ఒకతాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో ఈ వర్గాల పోరు యనమల రామకృష్ణుడికి తలపోటుగా మారిందని పలువురు అభిప్రాయపడ్డారు.



బాహాబాహీగా తలపడుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 3న కాకినాడలో సిఎం జగన్ పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఎస్‌పి ఎస్.సతీష్, కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, సిఎం భద్రతా సిబ్బంది, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డిఎస్‌పి రంగబాబు ఇతర అధికారులతో కలిసి కాకినాడ జిల్లా పోలీస్ క్రీడా మైదానంలో హెలిప్యాడ్ వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు, వైద్య శిబిరం, స్పందన కౌంటర్, ప్రజా ప్రతినిధులు వేచి ఉండే విఐపి స్టాల్స్ ఏర్పాట్లును పరిశీలించారు. పోలీస్ క్రీడా మైదానం నుంచి రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానం వరకు సిఎం రోడ్ షోలో పాల్గొంటున్నందున అందుకు తీసుకోవాల్సిన ఏర్పాట్లును పోలీస్, ట్రాఫిక్, డ్వామా, రోడ్లు భవనాలు, ఎపిఇపిడిసిఎల్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యం, ఆర్‌టిసి, మున్సిపల్ కార్పొరేషన్, టౌన్ ప్లానింగ్, జిల్లా పరిషత్ తదితర శాఖల అధికారులతో కలిసి పనులను పర్యవేక్షించారు. అనంతరం రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద జరుగుతున్న పనులను, ముఖ్యమంత్రి బహిరంగ సభకు లబ్ధిదారుల తరలింపు, మీడియా పాయింట్, పబ్లిక్ గేలరీ, స్టాల్స్ ఏర్పాటు తదితర పనులను ఎంఎల్‌సి, సిఎం పర్యటనల సమన్వయకర్త తలశిల రఘురాం, జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంఎల్ఎలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎపి భూదాన పరిషత్ ఛైర్మన్ టి.భాస్కర్ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందున అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వివిధ శాఖల అధికారులకు నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్‌పి బి.సత్యనారాయణ, డిఎస్‌పి కె..మురళీకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ నాగనరసింహారావు, జడ్‌పి సిఇఒ ఎ.రమణారెడ్డి, ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, కాకినాడ పెద్దాపురం ఆర్‌డిఒలు ఇట్ల కిషోర్, జె.సీతారామరావు, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ జె.నరసింహ నాయక్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, రోడ్డు భవనాల శాఖ ఎస్ఇ హరిప్రసాద్ బాబు, మెప్మా పీడీ బి.ప్రియంవద, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సురేంద్ర ఆనంద్, ఆర్‌టిఒ పివి.సాయిప్రసాద్, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా తదితరులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల రాస్తారోకో

ప్రజాశక్తి - కాకినాడ

సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులు సోమవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలని పెద్దపెట్టున నినదించారు. ప్రతిపక్ష నాయకుడిగా తమకు ఇచ్చిన హామీని జగన్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జెఎసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చంటిబాబు, సత్యానాగమణి మాట్లాడుతూ తక్షణం జగన్మోహన్ రెడ్డి హామీ మేరకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పార్ట్ టైం ఉద్యోగులను ఫుల్ టైం గా మార్చి మినిమం టైమ్స్ స్కేల్‌ను అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ సమగ్ర శిక్ష ఉద్యోగులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెవివి.నగేష్, టి.రవిచక్రవర్తి, కెవివి. రమణ, అసోసియేట్ అధ్యక్షులు వివి.రమణ, నాగమణి, గౌరవ అధ్యక్షులు ఎంవి.సాయిరాం, రాష్ట్ర కార్యదర్శి టి. అన్నారామ్, కోశాధికారి పివిఎస్.గణేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.లోవరాజు, సహాయ కార్యదర్శులు జి.నారాయణ, శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి.రాజు, ఎం.గంగాధర్ తదితరులు నాయకత్వం వహించారు.



కాకినాడలో రాస్తారోకో చేస్తున్న సిబ్బంది

అమలాపురం : సమగ్ర శిక్ష ఉద్యోగుల 13వ రోజు దీక్ష శిబిరం అమలాపురం కలెక్టరేట్ వద్ద సోమవారం కొనసాగింది. దీక్షలకు పలువురు మద్దతు తెలిపారు. ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, యుటిఎఫ్ నాయకులు తరపట్ల దుర్గాప్రసాద్, పలు ప్రజా సంఘాల నాయకులు సిహెచ్.సుధీర్, జివివి.సత్యనారాయణ, ఎన్ఎస్.ప్రకాశరావు, ఎంఎస్.నారాయణ, దొరబాబు నల్ల రామకృష్ణ, చిక్కం మైనర్ బాబు, బసవేశ్వర రావు, బిఎన్‌జిఎస్.గుప్తా, జెఎసి నాయకులు ముత్తాబత్తుల శ్రీనివాస్, భువనేశ్వరి, కె.వెంకట, పిఇటి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గుంట్రు సత్యనారాయణ, ఎ.శారద కృష్ణ, క్లస్టర్ రిసోర్స్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.శ్రీనుబాబు, కార్యదర్శి నామాడి వెంకట్, గూటం నాగన్న, నూకపెయ్యి గంగాధర్ రావు, గౌతమ్, కేత వెంకటేశ్వరరావు, సునీత, మోర్త శ్రీనివాసరావు, పి.రవికుమార్, పి.సునీత పాల్గొన్నారు.



అమలాపురంలో మద్దతు తెలుపుతున్న ఉద్యోగులు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవాలని జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆకాంక్షించారు. సోమవారం పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం ప్రచురించిన స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే 2023 - 24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధపడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో చదువుచున్న సుమారు 52 వేల మంది విద్యార్థినీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఇంగ్లీషు, తెలుగు మీడియంల వారీగా జడ్‌పి నిధులను ఖర్చు చేసి ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు 'జగనన్న విద్యా భారతి' స్టడీ మెటీరియల్ సహాయంతో చదువులో మరింత రాణించి 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్లు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలత, జడ్‌పి ముఖ్యకార్యనిర్వహణాధికారి ఎ.రమణారెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ పరిపాలనాధికారి ఆర్‌వివి.రమేష్, పలువురు జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

విశ్రాంతి భవనం ప్రారంభం

ఏలేశ్వరం : మండలంలోని లింగంపర్తి గ్రామ నందిబొమ్మ సెంటర్లో చెక్క అచ్చియ్యమ్మ జ్ఞాపకార్థం కుమారుడు చెక్క రాజు సొంత ఖర్చులతో విశ్రాంతి భవనం నిర్మించారు. ఈ భవనాన్ని సోమవారం ప్రముఖ వ్యాపారవేత్త ఊర కృష్ణ ప్రారంభించారు. చెక్క రాజు మాట్లాడుతూ నా తల్లి జ్ఞాపకార్థం విశ్రాంతి షెడ్డును నిర్మించడం జరిగిందన్నారు. ప్రారంభోత్సవానికి వచ్చిన స్థానికులకు అల్పాహారం, స్వీట్లు పంపిణీ చేశారు.



శేషారెడ్డి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న ఆదిత్య సిబ్బంది

ఆదిత్య శేషారెడ్డి ఇంట సందడి

కాకినాడ : ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి జన్మదిన వేడుకలతోపాటు, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆయన స్వగృహం వద్ద సందడి నెలకుంది. ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన సిబ్బంది పెద్దఎత్తున తరలి వచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలతోపా టు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఆదిత్య రవాణా విభాగం సిహెచ్. వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భారీ గజ మాల, బస్ ఆకృతిలో అతి పెద్ద కేక్‌ను కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో అదిత్య అధినేత లక్ష్మీ రాజ్యం, వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి దంప తులు, సెక్రటరీ దీపక్ రెడ్డి దంపతులు, వివిధ విభాగాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

జగనన్న స్ఫూర్తితో వికలాంగులకు సేవలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

జగనన్న సేవాసమితి ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ విభిన్న ప్రతిభావంతులకు నూతన వస్త్రాల పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలోని ఆయన నివాసంలో 200 మంది వికలాంగులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి రాయుడు సునీత గంగాధర్, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మాట్లాడారు. సిఎం జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు, వికలాంగులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మండలంలోని వికలాంగుల అవసరాలకు అనుగుణంగా వారికి మరిన్ని సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 100 మంది వికలాంగులకు చీరలు, 100 మంది పురుషులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, వైకాపా నాయకులు రెడ్డి సతీష్, కాల సూరిబాబు, బర్రె లక్ష్మీనరసింహ రాజు, వెంటపల్లి వెంకటేశ్వరరావు, గుత్తుల శ్రీనివాస్, పెంకే అర్జున్, మట్టపర్తి లోవరాజు ప్రజా సంఘాల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అత్తిలి బాబురావు, హనుమంతరావు పాల్గొన్నారు.



దుస్తులు అందిస్తున్న ఎంపిపి సునీత, ఎఎంసి ఛైర్మన్ శివన్నారాయణ

రాజ్యాంగ ఫలాలు అందరికీ దక్కాలి

ఉప్పలగుప్తం : రాజ్యాంగంలో పొందపరిచిన ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ తాను అందించేందుకు రాజకీయాల్లోకి వస్తున్నట్టు మాజీ ఎంపీ ఎజెవిబి.మహేశ్వరరావు కుమార్తె పాము సత్య శ్రీ తెలిపారు. గోపవరంలోని బుచ్చి మహేశ్వరరావు స్వగృహంలో తండ్రి బుచ్చి మహేశ్వరరావుతో కలిపి సోమవారం సత్యశ్రీ విలేకరులతో మాట్లాడారు. తాను ఐఎఎస్ భార్య అయినప్పటికీ చిన్నప్పటినుంచి తండ్రి బుచ్చి మహేశ్వరరావు ద్వారా రాజకీయాలను దగ్గర నుంచి చూసానన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వస్తున్నా పేద ప్రజలకు కావాల్సిన కనీస అవసరాలను తీర్చకపోవడం బాధ కలిగిస్తోందన్నారు. తన భర్త ఉన్నతాధికారిగా పని చేస్తున్నందున దేశంలోని అనేక రాష్ట్రాల్లో పేద ప్రజల జీవన విధానంపై అధ్యయనం చేస్తున్నానన్నారు. ఇప్పటికే సామాజిక బాధ్యతగా స్వచ్ఛంద సంస్థలలో చురుకైన పాత్ర పోషిస్తూ వారి జీవనస్థితిగతులు వాటి పరిష్కారంపై అవగాహన పెంచుకున్నట్టు చెప్పారు. పేద ప్రజల జీవనస్థితిగతులను మెరుగు పరిచేందుకు చంద్రబాబు సమక్షంలో తాను టిడిపిలో చేరానన్నారు. తప్పనిసరిగా టిడిపి అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని పేద ప్రజల అందరికీ రాజ్యాంగంలో పొందపరిచిన అంశాలను ప్రతి ఒక్కరికి అందించేందుకు కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు చంద్రబాబు చెప్పారన్నారు. తనకు ఎంఎల్ఎ టికెట్ ఇస్తే పోటీ చేసి నిబద్ధతతో ప్రజల సంక్షేమానికి వారి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

కైలాసగిరి నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండల కేంద్రమైన జగ్గంపేట గ్రామ శివారు నిర్మిస్తున్న కైలాస గిరికి సోమ వారం దాతలు ఆర్థిక సాయం చేశారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని జగ్గం పేటకు చెందిన భీమన సూరిబాబు, బ్రదర్స్ కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో కైలాస గిరి నిమిత్తం రూ.10 వేలు నగదును వైసిపి నాయకుడు ఒమ్మి రఘురాంకి అందజేశారు. ఆర్థిక సాయం అందించిన భీమన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.